www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 30 నవంబరు 2022

5

ఏలూరు

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు

ట్రాన్స్‌కో ఎస్ఇ శ్యామ్ బాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ వినియోగదారులకు భద్రతతో పాటు నాణ్యమైన సేవలందిస్తున్నామని తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు స్పష్టం చేశారు. మంగళవారం ఇక్కడ తమ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో తేడాలుంటే 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ వాడటంలో తగిన జాగ్రత్తలు వహించాలని కోరారు. అలాగే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం వల్ల వ్యవసాయదారులకు నష్టం వాటిల్లదని తెలిపారు. జిల్లాలో సుమారు లక్ష కనెక్షన్స్‌కు ఇప్పటివరకు 90 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్ల అమర్చామని వివరించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ ఝూన్సీ, ఎఇ సంజయ్, తురగా రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం దొరికేనా..!

నేడు ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం

ధాన్యం కొనుగోలులో రైతుల అవస్థలు వర్ణనాతీతం

నత్తనడకన ఇళ్లనిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో తాత్సారం

అధ్వానంగా జిల్లాలోని ఆర్‌అండ్‌బి రహదారులు

కౌలురైతులకు కార్డులు, రుణాల అందజేతలో తీరని అన్యాయం

మూడేళ్లుగా ఆధునికీకరణ పనుల ఊసే కరువు

పామాయిల్ మొక్కల కోసం రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా ప్రజానీకం అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ధాన్యం కొనుగోలు, ఆక్వా ఉత్పత్తుల అమ్మకాలు, ఇళ్ల నిర్మాణం, రోడ్లు వంటి అనేక సమస్యలు దీర్ఘకాలంగా జిల్లా ప్రజానీకాన్ని వెంటాడుతున్నాయి. ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన బుధవారం జరిగే ఏలూరు జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరికేనా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో ధాన్యం కొనుగోలు ఒకటి. గడిచిన మూడేళ్లుగా ధాన్యం కొనుగోలు వ్యవహారంలో జిల్లా రైతాంగం విలవిల్లాడుతున్నారు. గోనె సంచులు అందించకపోవడం, కొనుగోలు చేశాక నెలలు తరబడి ధాన్యం సొమ్ము జమ చేయకపోవడం వంటి పలు సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో రెండు లక్షలకుపైగా ఎకరాల్లో వరి సాగు సాగింది. ఇప్పటికే 80 శాతానికిపైగా మాసూళ్లు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రంగానే సాగాయి. నూతన విధానం పేరుతో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. జట్టు ఖర్చు బస్తాకు రూ.25 వరకూ అవుతోంది. లారీ నిర్వాహకులకు మామూళ్ల రూపంలో రూ.1300కుపైగా రైతులే చెల్లించాల్సి వస్తోంది. హమాలీల ఖర్చుల సొమ్ము ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ధాన్యం మాసూలు చేసిన తర్వాత కొనుగోలు చేయాలంటే 20 రోజులకు పైగా పడుతోంది. దీంతో రోడ్ల పొడవునా ధాన్యపు రాశులు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ధాన్యం సొమ్ము ఎప్పటికి వస్తుందోననే ఆందోళన రైతులను వెంటాడుతోంది. దీంతో ధాన్యం కొనుగోలు సమస్యలను డిఆర్‌సిలో చర్చించి పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వంద కౌంట్‌కు రూ.240 ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే అది ఎక్కడా అమలు కాకపోగా ఉన్న సరుకు కొనే పరిస్థితి లేకుండాపోయింది.

రోడ్లు, ఇళ్ల సమస్యల్లో జనం తీవ్ర ఇబ్బందులు

వైసిపి అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచిన ఇప్పటికీ జిల్లాలో ఆర్‌అండ్‌బి రోడ్ల వ్యవస్థ మాత్రం బాగు పడలేదు. దీంతో జనం పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఏలూరు-కైకలూరు రోడ్డు, గణపవరం-పిప్పర రోడ్డు, గణపవరం విప్పర్రు మీదుగా పెంటపాడు వెళ్లే రోడ్డు ఇలా అన్ని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అదిగో.. ఇదిగో అనడం మినహా రోడ్ల మాత్రం వేయడం లేదు. దీంతో నిత్యం జనం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక సిఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పేదల ఇళ్ల నిర్మాణం సైతం నత్తనడకన సాగుతోంది. ఇప్పటికీ సగం ఇళ్లు కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. చాలా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాని పరిస్థితి ఉంది. ఇళ్ల స్థలాల వద్ద మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలు ఏ మూలకూ సరిపోదు. దీంతో లబ్ధిదారులు అప్పు చేయాల్సిన పరిస్థితి రావడంతో అంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై డిఆర్‌సిలో ఏవిధమైన పరిష్కారం చూపుతారో వేచిచూడాలి.

కౌలురైతులను పట్టించుకునేవారే కరువు

జిల్లాలో 70 శాతం వ్యవసాయ సాగు కౌలు రైతులే చేస్తున్నారు. అయితే కౌలుకార్డులు ఇవ్వడంలోగాని, బ్యాంకు రుణాలు అందించడంలోగాని, ప్రభుత్వ సాయం రైతుభరోసా, బీమా, పంట నష్టపరిహారం ఇలా ఏవిషయంలో కౌలురైతులకు అందడం లేదు. 2019లో తీసుకొచ్చిన పంట సాగుదారుల చట్టం కౌలురైతులకు శాపంగా మారింది. కౌలురైతుల గురించి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కనీసం ధాన్యం అమ్ముకోలేని పరిస్థితిలో కౌలురైతులు దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నారు. కౌలురైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఆధునికీకరణ ఊసే కరువు.. పామాయిల్ మొక్కల కోసం అవస్థలు

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్లుగా జిల్లాలో ఆధునికీకరణ పనులు లేకుండాపోయాయి. దీంతో కాలువలు పూడుకుపోయి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రబీలో తీవ్ర సాగునీటి సమస్య ఏర్పడుతోంది. ఈ ఏడాదైనా ఆధునికీకరణ పనులపై ఏ నిర్ణయం తీసుకుంటారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో లక్షన్నర ఎకరాల్లో పామాయిల్ సాగు సాగుతోంది. ఇంకా అనేకమంది పామాయిల్ సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. మొక్కలు అందించాలని రైతులు కోరుతున్నారు. పామాయిల్ మొక్కల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఆదిలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా పోయింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు పరిహారం కోసం తీవ్ర ఆందోళనలు చేస్తున్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. మైక్రో ఇరిగేషన్, పశుబీమా, మినీ గోకులం బిల్లులు పెండింగ్ వంటి అనేక సమస్యలు ఉన్నాయి. డిఆర్‌సిలో సమస్యలపై చర్చ సాగి పరిష్కరిస్తేనే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ నాశనమైందని ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ అన్నారు. ఏలూరులో రెండు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభ స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యావ్యవస్థను మార్చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక సర్వనాశనం చేశారని విమర్శించారు. దేశంలో ఎక్కడా అమలు కాని నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనివల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ దిగజారుగుతుందన్నారు. ఇప్పటికే టీచర్ల బయోమెట్రిక్ పేరుతో తరగతి గదులకు వెళ్లకుండా బయోమెట్రిక్ వేయాలని గంటలు తరబడి నిలిపివేస్తున్నారన్నారు. కొత్తగా ఫేస్ బయోమెట్రిక్ అమలు చేస్తామని చెబుతున్నారని దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పేదవిద్యార్థులు చదువుకు దూరమవుతారన్నారు. భవిష్యత్తులో విద్యార్థి ఉద్యమానికి తన పూర్తి సహకారాన్ని అందిస్తానని చెప్పారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. విద్యార్థుల మధ్య మతాలు చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. పాఠ్యాంశాల్లో రాజ్యాల గురించి, భారతదేశం గొప్పతనం గురించి చెప్పాల్సింది పోయి మతాల గురించి, పార్టీల గురించి ముద్రిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, మండల పరిధిలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జెడ్‌పి సిఇఒ, చింతలపూడి నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవికుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల మూడో తేదీన తేదీన కనీసం వంద గృహ నిర్మాణాలకు శంకుస్థాపన జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బి.బాబ్జీ, ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహశీల్దార్ స్లీవ జ్యోతి, హౌసింగ్ ఎఇ రామకృష్ణ పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు గోదావరి జలాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు విలీన గ్రామపంచాయతీ ప్రజలకు గోదావరి జలాలు అందించే దిశగా ప్రణాళికలు రూపొందించి తగు చర్యలు చేపట్టామని నగర కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మంగళవారం కమిషనర్ తన ఛాంబర్‌లో తాగునీటి సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల ప్రకారం నగర ప్రజలకు నీటి సరఫరా రెండు పూటలా అందించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. 150 కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దెందులూరు బైపాస్ వద్ద గల ప్రధాన మంచినీటి నిల్వ కేంద్రం నుంచి స్థానిక పంపుల చెరువు ద్వారా గోదావరి నీటిని ప్రజలకు అందిస్తామన్నారు. ప్రస్తుతం 38 ఎంఎల్‌డి నీటి జలాలు నగర ప్రజలకు అందిస్తున్నామని అదనంగా 20 ఎంఎల్‌డి గోదావరి జలాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వన్‌టౌన్‌లో విలీనమైన గ్రామాలకు పోణంగిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు, రెండో పట్టణ పరిధిలో విలీనమైన గ్రామాలకు సత్రంపాడులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా నగర ప్రజలకు రెండు పూటలా నీరు అందించేందుకు ముందు జాగ్రత్తగా సంబంధిత అధికారులతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు.



కుమార్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కుమార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

అంబరుపేట గ్రామపంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఎఎస్‌విఎస్.కుమార్ అందించిన సేవలు అభినందనీయమని, ఇతరులకు ఆదర్శమని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణారావు తెలిపారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఎవిఎస్‌వి.కుమార్‌కు జిల్లా సంఘం, మండల ప్రజా పరిషత్, స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో భీమడోలులో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కుమార్ 1998లో పోతునూరులో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి, 2004లో వట్లూరు, 2011లో శనివారపుపేటలో పనిచేసిన అనంతరం 2014లో రామసింగవరం, కూచింపూడి గ్రామపంచాయతీలో గ్రేడ్ -2 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందారు. 2017లో వసంతవాడ గ్రేడ్-1 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందారు. బదిలీపై 2020లో సూరప్పగూడెం కార్యదర్శిగా వచ్చారు. మండల పరిధిలోని ఆరు ఇతర గ్రామపంచాయతీలో కార్యదర్శిగా పనిచేశారన్నారు. 2022లో అంబరుపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ ఉద్యోగ విరమణ తీసుకున్నారని తెలిపారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకకరించిన తీరును సహచర గ్రామపంచాయతీ కార్యదర్శులతో పాటు భీమడోలు ఎంపిడిఒ రాఘవన్, కె.రామయ్య, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీ రంగ, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, పలువురు సర్పంచులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ జాన్‌రాజు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొడుకును కోల్పోయిన తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆ దంపతులు జెసి అరుణ్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పొంగుటూరుకు చెందిన కనుమూరి జ్యోతి, శేఖర్ దంపతుల కుమారుడు చరణ్ తేజ తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో పాఠశాల సమీపంలోని చెరువులో పడి మృతిచెందాడు. అప్పటి జెసి కలెక్టర్ అంబేద్కర్, ఆర్‌డిఒ స్పందించి బిడ్డను పోగొట్టుకొన్న తమకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని, పొంగుటూరు సచివాలయం వద్ద ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ప్రస్తుత జెసి అరుణ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. వారితో జెసి మాట్లాడుతూ మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉద్యోగాలకు అవకాశం ఉన్న, లేక జిల్లాలోని ఖాళీ ఉన్నచోట వెరిఫికేషన్ చేసి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

జిల్లాలో విస్తృత ప్రచారం

ప్రచారజాతాలో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

డిసెంబర్ ఆరో తేదీ నుండి పదో తేదీ వరకూ జిల్లాలోని ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ, వివిధ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి కోరారు. మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ చౌక్ వద్ద మహాసభల ప్రచార యాత్ర ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా నాయకులు పి.కిషోర్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. సంఘం రాష్ట్ర మహాసభ జిల్లాలో తొలిసారిగా జరగడం సంతోషదాయకమన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి, కూలీల ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. డిసెంబర్ ఆరో తేదీన ప్రజా సమస్యలపై ఫొటో ఎగ్జిబిషన్, ఉచిత వైద్య శిబిరం, ఏడో తేదీన హైస్కూల్, కళాశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. వీటికి ప్రముఖ కళాకారుడు గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెంలో వేలాది మందితో ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందని తెలిపారు. ఎంపికైన 500 మంది ప్రతినిధులతో మహాసభ జరుగుతుందన్నారు. ఇందులో వ్యవసాయ రంగ అభివృద్ధి, వ్యవసాయ కార్మికుల భూమి, కూలీ, ఉపాధి అంశాలపై పోరాట కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సంపూర్ణంగా జయప్రదం కావాలని కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి రైతు, వ్యవసాయ కార్మికుల ఐక్యత ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు బి.సోమయ్య, ఎస్.మహంకాళీ, బి. జగన్నాధరావు, వి.సాయిబాబు, ఎ.శరత్ చంద్ర, గోపి, మీసాల సత్యం, కోటేశ్వరరావు, జాన్ బాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు: వచ్చేనెల ఎనిమిదో తేదీ నుంచి జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గొల్లగూడెం, గోపినాథపట్నం, నారాయణపురం, ఉంగుటూరు గ్రామాల్లో ప్రచారయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉంగుటూరు మండల కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు, ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు నక్క సుబ్బారావు, పుల్ల పెద్దిరాజు, కొయ్యే బజారు, పుల్ల నరసింహమూర్తి, కె.జయరాజు, సిహెచ్.గోపి, పి.రాజు, ఆనందరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. మంగళవారం మహాసభ నేపథ్యంలో డిసెంబర్ ఎనిమిదో తేదీన జరిగే బహిరంగ సభలో కార్మికులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచారయాత్రను సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడారు. సంపద సృష్టికర్తలైన వ్యవసాయ కార్మికుల రాష్ట్ర మహాసభ ప్రచారం నిమిత్తం పట్టణంలో ప్రారంభమైన యాత్ర కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుకునూరు, టి.నరసాపురం, చింతలపూడి, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల్లో మూడు రోజులపాటు పర్యటించి మహాసభ ప్రచారం చేస్తారని తెలిపారు. ఈ ప్రచారయాత్రలో సంఘం రాష్ట్ర నాయకురాలు తామ ముత్యాలమ్మ, తుమ్మల సత్యనారాయణ, ఆర్ దానియేలు, సముద్రాల సాయి కృష్ణ, పి.సూర్యారావు, జి.సూర్యకిరణ్, ప్రభాకర్‌రావు, చంటి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు అన్నారు. మంగళవారం వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో జరిగే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ ఆటో ప్రచారయాత్ర కొయ్యలగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నుండి ప్రారంభమై ఈ యాత్ర బయ్యనగూడెం, కొయ్యలగూడెం, కన్నాపురం మీదుగా పోలవరం వెళ్లనుందన్నారు. ఈ ప్రచారయాత్రలో అన్నవరం సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి తామ ముత్యాలమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు కారం భాస్కర్‌రావు, జిల్లా నాయకులు సముద్రాల సాయికృష్ణ, సిఐటియు నాయకులు ముళ్లపూడి సురేష్, షేక్ జానీ పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

కొయ్యలగూడెం : సిఎం జగన్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి, టిడిపి నేత దేవినేని ఉమ అన్నారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలు వద్ద టిడిపి మండల ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్రనాథ్ అధ్యక్షతన మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలా దేవి, రామారావు, చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

చింతలపూడి : ఈనెల 30వ తేదీన పట్టణంలో చంద్రబాబు పర్యటన, సభ ఏర్పాట్లను టిడిపి నాయకులతో కలిసి పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జోన్-2 పరిశీలకులు, మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, ఏలూరు జిల్లా రైతు అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవ, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, మాజీ ఎంపిటిసి కె.రాజారెడ్డి, నాయకులు తాటి అప్పారావు, అట్లూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు గుడిపూడి రవి, మారుమూడి థామస్, అచ్చాయమ్మ, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఈనెల 30న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, టిడిపి నేత పీతల సూజాత అన్నారు. చింతలపూడి పట్టణంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వైసిపి పాలనతో ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.

ఉంగుటూరు : చంద్రబాబు పర్యటనలో భాగంగా ఈనెల 30న కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఘనస్వాగతం పలికేందుకు టిడిపి ఎస్సీ సెల్ విభాగం కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని ఆపార్టీ మండల అధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం అన్నారు. మంగళవారం నీలాద్రిపురంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలుత గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేశారు. కార్యక్రమంలో నీలాద్రిపురం గ్రామ అధ్యక్షులు రమేష్, నాయకులు సిహెచ్.కాంతారావు, బి.దుర్గారావు, పి.రాజారత్నం, డి.దిలీప్, డి.మురళీ పాల్గొన్నారు.

రైతుబజార్లలో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఏలూరు: రైతుబజార్లలో కూరగాయల ధరల పట్టిక ప్రజలకు తెలిసేలాగా ప్రదర్శించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రైతుబజార్ల నిర్వహణపై మార్కెటింగ్ శాఖ అధికారులతో జెసి పి.అరుణ్ బాబుతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన కూరగాయలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు బజారులో విక్రయించేందుకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

క్లాత్ బ్యానర్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన

ఏలూరు: రాష్ట్రంలో ఫ్లెక్సీ, బ్యానర్ల నిషేధం నేపథ్యంలో ఫ్లెక్సీ బ్యానర్ యూనిట్లచే ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యానర్ యూనిట్లను నెలకొల్పే ప్రక్రియలో భాగంగా వారికి అవగాహన కల్పించే నిమిత్తం జిల్లాలోని ఫ్లెక్స్ బ్యానర్ యూనిట్‌దారులతో కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఏలూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్లాస్టిక్ ఫ్లెక్స్ బ్యానర్లను నిషేధించినందున ఆ యూనిట్ల వారు క్లాత్ బ్యానర్ తయారీ యూనిట్లకు మారడం తప్పనిసరి అయిందన్నారు. వారు కొత్త క్లాత్ బ్యానర్ తయారీ మిషన్లు, రామెటీరియల్ కొనుగోలుకు పిఎంఇజిపి పథకంలో రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ స్కీములో 15 శాతం నుండి 35 శాతం వరకూ సబ్సిడీ ఉంటుందన్నారు.

సచివాలయాల్లో పిల్లల దత్తత పోస్టర్లు

ఏలూరు: కారా (సెంట్రల్ అడాప్షన్ రిసోర్సెస్ అథారిటీ) ద్వారా పిల్లలను దత్తత ఏ విధంగా పొందాలి అనే విషయాలను పిల్లలను కోరుకొనే తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా పోస్టర్ల ప్రతీ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేయాలని మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కారా ద్వారా దరఖాస్తు చేసుకున్న దంపతులకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో కలెక్టర్ అందించారు. పిల్లలను దత్తత తీసుకున్న తల్లితండ్రులు వారి ఆలనా పాలనతోపాటు పిల్లల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ చెప్పారు. పిల్లల దత్తతకు సంబంధించి తదుపరి వారి ఫాలోఅప్ రిపోర్ట్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా శిశు సంరక్షణ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

వీధి బాలలకు రక్షణ కల్పించాలి : కలెక్టర్

ఏలూరు: వీధి బాలలను గుర్తించి వారి శ్రేయస్సుకు పాటుపడాలని ఇందుకు గ్రామ, మండలస్థాయిలో రిస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీధిబాలల పరిస్థితులపై పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి బాలలను, బిక్షాటన చేస్తున్న బాలలను, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురవుతున్న బాలలను గుర్తించి ప్రత్యేక హోమ్‌లో ఉంచాలన్నారు. వారి విద్య కొనసాగింపునకు, వారికి అవసరమైన ఆధార్ తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు.

పారదర్శకంగా 'జగనన్న భూ రక్ష'

ఏలూరు: జిల్లాలో జగనన్న భూరక్ష, భూ సర్వే కార్యక్రమం పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సర్వే సిబ్బందికి లాప్ టాప్‌లు, హార్డ్ డిస్క్‌లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి వివాదాల్లేని భూముల వివరాలు జగనన్న భూరక్ష, భూ సర్వే ద్వారా సాధ్యమన్నారు. ఈ కార్యక్రమం పటిష్టంగా సాగేందుకుగాను కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారని, ఈ కేంద్రాల ద్వారా భూ సర్వే పనులను పర్యవేక్షించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఏర్పడే సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. భూసర్వేలో గుర్తించిన వివరాలను డివిజన్‌స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని చెపారు. ఈ కార్యక్రమంలో జెసి పి.అరుణ్‌బాబు, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, సర్వే శాఖ సహాయ సంచాలకులు టి.వెంకటేశ్వరరావు, సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ టిబిఎస్‌వి.రమణరావు, సిహెచ్.శ్రీనివాసరావు, జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వరరావు, బి.శ్రీరామ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రూ.79 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - ఏలూరుస్పోర్ట్స్

సెల్‌ఫోన్ల రికవరీలో ఏలూరు సిసిఎస్ పోలీసులు అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ క్రమంలో ఎంతో చాకచక్యంగా రూ.79 లక్షల విలువైన ఫోన్లను నలుగురు దొంగల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ వివరాలు వెల్లడించారు. అనంతరం బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. చోరీలకు పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు.

నేడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఫసలి 1432 రబీ పంటకు సంబంధించి జిల్లా ఇంఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ నెల 30న జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి సాగునీటి పారుదల సలహామండలి సభ్యులకుఈనెల 22న లేఖ పంపించామని పేర్కొన్నారు. జిల్లాలోని కాలువలు, డ్రెయిన్లలో తూడు, కర్రనాచు, ఇతర తాత్కాలిక పనులు చేపట్టేందుకు గాను విజయవాడ కాడా కమిషనర్ ఇప్పటి వరకూ 48 పనులకుగాను రూ.787.48 లక్షల అనుమతులు మంజూరు చేశారని, అందులో 44 పనులకు గాను గుత్తేదారులు ఖరారయ్యారని తెలిపారు. అందులో 18 పనులు పూర్తికాగా మరో 25 పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. మరో పనిని ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. ఒఅండ్ఎం పనులు కాలువపై మార్చి 2023 వరకూ, డ్రెయిన్లపై డిసెంబరు 2022 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో పంట రబీకి నీటి విడుదల అనంతరం కూడా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో తగుచర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి పశ్చిమ డెల్టాలో కాలువలు, డ్రెయిన్ల ఆధునీకరణకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫేజ్-2లో ప్రతిపాధనలు రూపొందించామని పేర్కొన్నారు.

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లపై పశువులను ఇష్టానుసారంగా వదిలేసిన యజమానులకు జరిమానా విధించినట్లు కార్పొరేషన్ ఎంహెచ్ఒ డాక్టర్ మాలతీ తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని పలు ప్రాంతాల్లో మంగళవారం హెల్త్ అధికారి మాలతి, సంబంధిత సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలతి మాట్లాడుతూ నగరంలో రోడ్లపై సంచరించే పశువుల వల్ల వాహనదారులు, ప్రజలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్ రాజ్, సచివాలయ, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ 'స్పందన' నిర్వహించాలి
సచివాలయ సిబ్బందికి డిపిఒ ఆదేశం

ప్రజాశక్తి - భీమడోలు

రికార్డులు పరిశీలిస్తున్న డిపిఒ

గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు గ్రామ సచివాలయాల వద్ద స్పందన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని జిల్లా పంచాయతీ అధికారి బివికె.మల్లికార్జునరావు ఆదేశించారు. ఆయన మంగళవారం భీమడోలు మండలంలోని కోడూరుపాడు, దుద్దేపూడి, పూళ్ల, కురెళ్లగూడెం గ్రామాలను సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద వర్మీ కంపోస్ట్ తయారీ నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామం గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షన్ పురస్కారం సాధించే విధంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దుద్దేపూడిలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోడూరుపాడు సర్పంచి నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

ఆలిండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి.రాజ్‌లక్ష్మికుమారి తెలిపారు. ఎంపికైన పాఠశాల విద్యార్థులు కె.శ్రీవల్లి, ఎం.శ్రావణి, జె.మహాలక్ష్మి, ఎల్.సరిత, జె.హారికను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న కాలనీల్లో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో జగనన్న కాలనీ లే అవుట్‌లో తాగునీటి బోరు పనులను మంగళవారం సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్‌లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసిలు కలపర్తి సుజాత, తోట శ్యామల, మాజీ ఎంపిపి ప్రకాష్‌బాబు, హౌసింగ్ ఎఇ జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి, ప్రధానోపాధ్యాయులు హెచ్.హన్మామణి ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు, ఎస్సే రైటింగ్, జెబి టెస్టులు నిర్వహించారు. డిసెంబరు 3వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి మూడో తేదీన బహుమతులు అందించనున్నట్లు ఉపాధ్యాయులు డిఎంఎల్‌వి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి తెలిపారు.

పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

ఉద్యోగులు సంఘటితంగా పోరాటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎన్‌జిఒ సంఘం కార్యదర్శి నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో చింతలపూడి తాలూకా ఎన్‌జిఒ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఏపి ఎన్‌జిఒ సంఘం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఏలూరు తాలూకా అధ్యక్షులు శ్రీధర్‌రాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం ఉద్యోగుల ఐక్య పోరాటాలు చేయటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం చింతలపూడి తాలూకా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా వి.గంగాధరరావు, కార్యదర్శిగా కె.పెద్దిరాజు, కోశాధికారిగా టి.మల్లయ్య, సహ అధ్యక్షులుగా ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యక్షులుగా నాగబాబు, మంగరాజు, రామకృష్ణ, వి.రమేష్, సహాయ కార్యదర్శిగా రత్నరాజు, రమేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

నిర్వాసితులను మోసగించిన జగన్ : టిడిపి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సిఎం జగన్ మోసం చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. బుట్టాయగూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తెలుగు యువత విభాగం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ సర్కారు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. డిసెంబర్ ఒకటో తేదీన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పోలవరం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించి ప్రాజెక్ట్ సందర్శించి ప్రసంగిస్తారని చెప్పారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏలూరు పార్లమెంట్ టిడిపి తెలుగుయువత అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు, ఉపాధ్యక్షులు బొసిపి రాజబాబు, నియోజకవర్గ అధ్యక్షులు నాదెండ్ల సురేంద్రనాథ్ చౌదరి, ఏలూరు పార్లమెంట్ అధ్యక్షులు శావలి సుభాష్ చంద్రబోస్, తెలుగు యువత మండల అధ్యక్షులు పెద్దిన సురేష్, శివంగి సుమంత్, మిసాల పవన్‌కల్యాణ్, సుభాని పాల్గొన్నారు.

కైకరంలో షష్టి తిరునాళ్లు

వైభవంగా షష్టి తిరునాళ్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలం కైకరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకలు నాగమ్మ ఆలయంలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 2:09 గంటలకు స్వామివారి కళ్యాణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కళ్యాణం అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్త ఖ్యాతి గాంచిన కైకరం షష్టి వేడుకలకు ఉభయగోదావరి జిల్లాల నలుమూలల నుంచి భక్తులు వస్తున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గణపవరం సిఐ సుభాష్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 94 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల దర్శనానికి వేచి ఉన్న క్యూలైన్ల వద్ద గ్రామస్తులు, దాతలు భక్తులకు ఉచితంగా పాలు అందించారు.

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం-పేరూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి కళ్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం తెల్లవారుజామున స్వామి కళ్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామిరెడ్డి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ దంపతులు వైభవంగా కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే వేలాది ప్రజలు దేవస్థానానికి తరలివచ్చారు. క్యూలైన్ల వద్ద భక్తులకు కుంకుమలు అందించారు. ఎస్ఐ షణ్ముఖసాయి పోలీసు బందోబస్తు నిర్వహించారు. రెండో రోజు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ శౌరి నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కంప్యూటర్ శిక్షణతో మెరుగైన ఉపాధి
కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పొందిన 17వ బ్యాచ్ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను మంగళవారం ప్రదానం చేశారు. స్థానిక అన్నే భవనంలో ఆ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కె.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970వ దశకం నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం, కంప్యూటర్లు ప్రపంచంలో ఉనికిలోకి వచ్చాయన్నారు. ఏలూరు వంటి పట్టణంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం పేదవారికి కూడా అందుబాటులో ఉండేలా చక్కటి కంప్యూటర్ శిక్షణా కేంద్రం నిర్వహించడం సంతోషకరమన్నారు. హేలాపురి బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సర్టిఫికెట్లు, మార్కులు పొందడమే కాకుండా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. నేటి విద్యార్థులు కృషి పట్టుదల ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. అందుకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం మానవత, కొన్ని లయన్స్ క్లబ్‌లు, మాతృదేవోభవ సంస్థల ద్వారా తాము అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణకు ప్రిన్సిపల్‌గా ఉన్న బి.పూర్ణచంద్ తనకు తెలిసిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వీలైనంత ఎక్కువ మందికి అందించడం కోసం కృషి చేస్తున్నారని అభినందించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణతో పాటు హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్లు, బుక్ బ్యాంకు, మహనీయుల ఆశయాల బాట పేరుతో అనేక కార్యక్రమాలను విజ్ఞాన కేంద్రంలోని 75 మందితో కూడిన కమిటీ భాగస్వామ్యంతో జయప్రదంగా ముందుకు తీసుకెళుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.పూర్ణచంద్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు జి.శారద, టి.రవికుమార్, పి.రవికిషోర్, ఎస్.రవి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వెంకటేశ్వరరావు

సమగ్ర రీ సర్వేతో రైతులకు మేలు
జెసి అరుణ్‌బాబు, ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న జెసి, ఎంఎల్ఎ

జగనన్న శాశ్వత భూ హక్కు ద్వారా రైతులకు మేలు జరుగుతుందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పొంగుటూరు గ్రామంలో మీ భూమి- మా హామి సమగ్ర రీ సర్వే కార్యక్రమం తహశీల్దార్ పి.నాగమణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. తొతుల మండలంలో పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేసి శాశ్వత పత్రాలను సంబంధిత రైతులకు జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంఎల్ఎ బాలరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. తమ భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇతర పట్టణాలకు వెళ్లకుండానే మండలంలో, గ్రామాల్లో రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి శాశ్వత పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. సచివాలయాన్ని సందర్శించి స్పందన దరఖాస్తులు వస్తున్నాయా లేదా అని రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబుకు గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత 31 గ్రామాల రైతులు తమ పొలాల్లోకి వెళ్లడానికి దారులు చూపించాలని, న్యాయమైన నష్టపరిహారం అందించాలని, చెట్లు, కట్టడాలు, మొదలైన వాటికి కొత్త జిఒ ప్రకారం పరిహారం ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్‌డిఒ ఝాన్సీ రాణి, ఎంపిపి గంజిమాల రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, సర్పంచి పసుపులేటి రాంబాబు, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు ఏలేటి చిన్నతుక్కయ్య, విఆర్‌ఒ రాంబాబు, ఆర్ఐ మణిదివ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భీమడోలు : భూ వివాదాల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే సహకరిస్తుందని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. మండలంలోని కోడూరుపాడులో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రైతులకు సంబంధిత పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ సమగ్ర భూ హక్కు-భూ రక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అధునాతన పద్ధతులతో చేపట్టిందన్నారు. రైతులకు ఉచితంగా పత్రాలు పంపిణీ చేస్తుందని చెప్పారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, ఎంపిపి కె.రామయ్య,, భీమడోలు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీత మాన్ సింగ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బంధంచర్ల మీదుగా చింతలపూడి వెళ్లే ఏలూరు డిపో ఆర్‌టిసి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శిస్తూ సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాచప్రోలు చరణ్, మారుముళ్ల అభిలాష్ మాట్లాడుతూ గత 30ఏళ్లుగా ఏలూరు ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు సర్వీసు మండలంలోని బంధంచర్ల, టి.నరసాపురం మీదుగా చింతలపూడి ఉదయం, సాయంత్రం ఉండేదన్నారు. నెల రోజులుగా ఆర్‌టిసి అధికారులు బస్సు సౌకర్యం నిలిపివేశారని, దీంతో బంధంచర్ల, కేతవరం, రాజుపోతేపల్లి, అల్లంచర్ల పంచాయతీలోని విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు టి.నరసాపురం వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

డిడిఆర్‌సి సమావేశంలో రైతాంగ సమస్యలపై చర్చించాలి
ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ

ఏలూరు : జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం(డిడిఆర్‌సి)లో జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు వేగవంతం కాక కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. ఎకరాకు 40 బస్తాలు కొనుగోలుకు పరిమితి పెంచాలన్నారు. గోనె సంచులు కొరత నివారించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు చెల్లించాలన్నారు. చనిపోయిన పశువులకు ఇవ్వాల్సిన బీమా పరిహారం అందించాలన్నారు. రబీలోనైనా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రబీలో గోదావరి పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చి శివారు ప్రాంత భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఎన్‌సిసి విద్యార్థులకు రాయితీలు

ప్రజాశక్తి - భీమడోలు

రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

ఎన్‌సిసిలో శిక్షణ పొందిన విద్యార్థులు ఉద్యోగ కల్పన, ఉన్నత విద్యాభ్యాసాలలో రాయితీలు పొందే అవకాశం ఉందని, వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు బొమ్ము రవికుమార్ తెలిపారు. భీమడోలులోని డిగ్రీ, జూనియర్ కళాశాలలో మంగళవారం 75వ ఎన్‌సిసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలతో పాటు గీతాంజలి విద్యాసంస్థల విద్యార్థులు రక్తదానం చేశారు. పలువురు విద్యార్థులు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలను చేయించుకున్నారు. వైద్య సేవలను భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం రక్త నిధి నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి మత్తు వైద్య నిపుణులు వి.రవిపాల్ ఆధ్వర్యంలోనే సిబ్బంది సేవలందించారు. రక్తదానంపై విద్యార్థులను చైతన్యపరిచే కార్యక్రమాలను కళాశాల ఎన్‌సిసి విభాగపు లెఫ్ట్‌నెంట్ కె.శివ శంకర్ చేపట్టారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ కళాశాలలో 2005 నుంచి ఎన్ఎస్ఎస్ విభాగం ప్రారంభించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా లెఫ్ట్ నెంట్ కె.శివశంకర్ ఆధ్వర్యంలో 2011 నుంచి ఎన్‌సిసి విభాగాన్ని ప్రారంభించామని, ప్రతి సంవత్సరం 50 మందికి తక్కువ కాకుండా ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా జారీ చేసే బి, సి సర్టిఫికెట్ల ఆధారంగా వీరు ఉద్యోగ కల్పన, ఉన్నత విద్యకు అర్హత, రాయితీ సాధించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు వంగా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'1న బిసిల ఆత్మీయ సమావేశానికి తరలిరావాలి'

టి.నరసాపురం: డిసెంబర్ ఒకటో తేదీన జంగారెడ్డిగూడెం శివారు కరాటం వై.జంక్షన్ వద్ద ఉన్న దండమూడి రామలక్ష్మి ఎసి కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బిసిలంతా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఇంటివద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే కార్యక్రమంలో టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బిసిల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు.

దళిత సంఘాల బలోపేతానికి కృషి

ముదినేపల్లి : రాష్ట్రంలోని దళిత సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని మాలమహానాడు వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు అన్నారు. ముదినేపల్లిలోని జిల్లా దళిత సంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన దళిత సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శేవా నాగజగన్‌బాబూరావు అధ్యతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయకుమార్, దండోరా నాయకులు ఏసుపోగు దానియేలు, రాష్ట్ర బిసి అధ్యక్షులు పోసిన పాపారావుగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1.14 కోట్లతో భీమడోలు బడ్జెట్ ఆమోదం

భీమడోలు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం 2023- 24 ఆర్థిక సంవత్సరానికి కోటీ 14 లక్షల 21వేల200 రూపాయల మిగులుతో అంచనా బడ్జెట్ ఆమోదం పొందింది. ఎంపిపి కె.రామయ్య అధ్యక్షతన సర్వసభ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి తరపున ఎంపిడిఒ రాఘవన్ 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను కోటీ 46 లక్షలు 75 వేల వంద రూపాయల సవరణ బడ్జెట్, 2023- 24 సంవత్సరాల అంచనా బడ్జెట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.33.16 కోట్ల జల జీవన్ మిషన్ నిధులు ఎమ్మెల్యే వాసుబాబు చొరవ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సహకారంతో మంజురయ్యాయన్నారు. దీనిలో భాగంగా రూ.21 కోట్లతో ఆగడాలలంక కేంద్రంగా గోదావరి జలాలను తాగునీటిగా సరఫరా చేసేందుకు రిజర్వాయర్, సుమారు రూ. ఏడు కోట్లతో చెట్టున్నపాడు కేంద్రంగా తాగునీటి సౌకర్యాల కల్పనకు కేటాయించారన్నారు. భీమడోలు తాగునీటి ప్రాజెక్టు ద్వారా ఫిల్టర్ కానీ జలాలు తాగునీటిగా అందజేస్తున్నారన్న సమస్యపై స్పందించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, ఎఎం సి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, తహశీల్దార్ జాన్ రాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ కన్వీనర్‌ను నియమించేనా..!

ప్రజాశక్తి - చింతలపూడి

ఈనెల 30వ తేదీన మండలంలో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2019 ఎన్నికల ఓటమి అనంతరం మండలంలో టిడిపి బలోపేతానికి అందరూ ఒక తాటిపైకి వచ్చి చేసిన కార్యక్రమాలు చాలా తక్కువ. ఆ తర్వాత నియోజకవర్గ కన్వీనర్‌గా, ఎంఎల్ఎ అభ్యర్థి కర్రా రాజారావునే కన్వీనర్‌గా కొనసాగించారు. ఆయన మరణం తర్వాత సుమారు రెండేళ్లుగా చింతలపూడి నియోజకవర్గానికి కన్వీనర్‌ని అధిష్టానం నియమించలేదు. దీంతో రోజులు గడుస్తున్న కొద్దీ ఆశావహుల సంఖ్య పెరిగింది. ఎవరికి వారు తానే అభ్యర్థినంటూ బహిరంగంగా ప్రకటిస్తున్నారు. దీనికితోడు ఆధిపత్యపోరు కూడా అంతకుమించి ఉంది. దీనిపై చంద్రబాబు ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సి ఉంది.

పీతల సుజాతను ప్రకటిస్తారా..!

పార్టీకి వీర విధేయురాలి ఉన్న పీతల సుజాత పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఎంఎల్ఎ హయాంలో ఆమె అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇవన్నీ ఆమెకు కలిసి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో మాజీ ఎంఎల్ఎ మద్దాల రాజేష్ టిడిపిలో చేరుతారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన అభిమానులు, అనుచరులు సందిగ్ధంలో ఉన్నారు. ఆయన పార్టీలో చేరితే యువనాయకుడు కావడంతో ఆయన పేరు కూడా వినిపిస్తుంది.

సొంగా రోషన్‌కుమార్ ఎన్‌ఆర్ఐ మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తూ, నియోజకవర్గంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన ఎన్‌ఆర్‌ఐలో ఉంటూ, ఇక్కడ తమ సభ్యులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. 2024లో ఎంఎల్ఎ సీటు ఆసిస్తున్న వారిలో ఈయనకూడా ఉన్నారు. కర్రా రాజారావు తనయుడు కర్రా కర్తీక్ కూడా రేస్‌లో ఉన్నారు. ఈయనతో పాటు నియోజకవర్గానికి చెందిన కోండ్రు దేవా, పల్లి శ్రీను, కొక్కిరగడ్డ జయరాజు, గుడిపుడి రవి, మారుమూడీ థామస్ కూడా ఆశావహుల్లో ఉన్నారు.

NAME CHANGE

I. MOHAMMED VAZEERUDDIN, S/o. Mohammed Mubashruddin, D.No. 1-28, Shadikhana Rao, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., I hereby declare that, I have been changed my Minor Daughter's name from **MOHAMMAD FAIZATABASSUM** (Old Name) to **MOHAMMED FAIZATABASSUM** (New Name). Hence after my Minor daughter's documents and correspondence will be continue with her new name **MOHAMMED FAIZATABASSUM.**

NAME CHANGE

I. FAMEEN, W/o. Mohammed Vazeeruddin, D.No. 1-29, Shadikhana Street, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., have changed my Name from **FAMEENA** (Old Name) to **FAMEEN** (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name **FAMEEN**

పాస్‌పోర్టు పోయినది

EDA VIMALA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 08-02-2017న **P5702598** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు లిఖితపూడి గ్రామం నుండి నరసాపురం పట్టణం వెళ్తుండగా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

EDA VIMALA
D/o. Eda Prakasa Rao, D.No. 3-61, Subbarayudu Gudem, Likhithapudi, Saripalli Post, Narasapuram Mandal, West Godavari Dist., A.P.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా, అత్తిలి మండలం, వరిఘేడు శివారు ఎర్రనీలిగుంట, ప్రస్తుతం తణుకు మండలం, పైడిపర్రు గ్రామ కాపురస్తులు **పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ గారి కుమారుడు భాస్కరరావు గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, ది. 20-11-2022 నా క్లయింటు ఇంటి స్థలం ఒరిజినల్ దస్తావేజు నెం. 2243/2013 ఆఫ్ SRO, సజ్జాపురం మరియు SBI Life Insurance ఒరిజినల్ బాండు నెం. IK 661279506 జిరాక్స్ తీసుకొనుటకు పైడిపర్రు సెంటర్ నందు జిరాక్స్ తీసుకుని మరలా యింటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో నా క్లయింటు యొక్క ఒరిజినల్ స్థలం దస్తావేజు, SBI Life Insurance ఒరిజినల్ బాండు పడిపోయినవి. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు మరియు ఇన్సూరెన్సు బాండు ఎవరికైనా దొరికిన యెడల మాకు గాని, మా క్లయింటుకు గాని తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

VENNAPU SUDHAKARA RAO
KAKOLLU VIJAYA
Advocates, D.No.18-5-2, IInd Floor
AMR Complex, Atyam vari Street
Tanuku-534211, W.G.Dt (A.P)

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, ఏలూరు
ట్రాన్స్‌ఫర్ ఓ.పి. నెం. 17/2022

శ్రీమతి మద్దుల విజయలక్ష్మి వగైరా -పిటీషనర్లు
మరియు
శ్రీమతి జూపూడి దేవిశ్రీ వెంకట నాగమణి సావిత్రి వగైరా -రెస్పాండెంట్లు

పై నంబరు ఓ.పి. గ్రంధమును ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఫైలు ఓ.ఎస్. నెం. 301/2013 దావాను, ఆ కోర్టు నుండి ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయవలసినదిగాను, అక్కడ పెండింగులో వున్న ఓ.ఎస్. నెం. 176/2018 కలిపి విచారించవలసినదిగాను దాఖలు చేయగా, పై నంబరు ఓ.పి. గ్రంధములో 3వ రెస్పాండెంటు అయిన
శ్రీ మద్దుల వెంకట గోపాల అచ్యుత మాధవ్,
తండ్రి: శ్రీ మద్దుల దామోదరరావు,
డోరు నెం. 24బి-10-23, రాఘవాచారివారి వీధి, రామచంద్రరావుపేట, ఏలూరు - 534002.

గారికి నోటీసులు నిమిత్తము ది. 13-12-2022 తేదీని వాయిదా అయివున్నది. కాబట్టి సదరు 3వ రెస్పాండెంటు పై కోర్టు వారి ఎదుట **ది. 13-12-2022 తేదీని ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్సుపార్టీ చేసి కోర్టు వారు తగు ఉత్తరువులు దయ చేయగలరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు **ఎస్.వి.ఆర్.గాంధీ**
తేదీ:24-11-2022 పిటీషనర్ల తరపు అడ్వకేట్

NAME CHANGE

I. MOHAMMED VAZEERUDDIN, S/o. Mohammed Mubashruddin, D.No. 1-28, Shadikhana Road, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., have changed my name from **MOHAMMAD VAZEERUDDIN** (Old Name) to **MOHAMMED VAZEERUDDIN** (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name **MOHAMMED VAZEERUDDIN.**

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 270/2020

Between:
Canara Bank (e-Syndicate Bank), Tanuku, Rep. by its Manager. ***...Plaintiff***
AND
1) Yentrapragada Vijaya Kumar, S/o. Joseph, RTC Driver, Tanuku.
2) Pagada Srinivasa Rao, S/o. Naga Bhushanam, Superintendent, APSRTC, Tanuku. ***...Defendants***

వాదికి రావలసిన బాకీ రూ.4,45,292-17 పైసలు, దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు నిమిత్తం ప్రతివాద్లు పై దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా నందు 1,2 ప్రతివాదులు హాజరు నిమిత్తం ది.28-12-2022న వాయిదా అయి ఉన్నది. 1,2 ప్రతివాదులు **ది.28-12-2022వ తేదీన పైన తెల్పిన కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలెను.** ఇందు తప్పే యెడల పై నెంబరు దావా 1,2 ప్రతివాద్లు యొక్క పరోక్షమునందు తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ప్రకటన ది. 21-11-2022వ తేదీ గల కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రకటించడమైనది.

సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు, వాది తరుపు న్యాయవాది,
28-11-22. తణుకు. సెల్: 99895 67750

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిలు జడ్జి వారు, తాడేపల్లిగూడెం
ఐ.ఎ. నెం. 199/2018
అందున
ఓ.ఎస్. నెం. 258/2018

మధ్య:
పిటీషనరు/ వాది:
శ్రీమతి పేరాబత్తుల సీతామహాలక్ష్మి
మరియు
రెస్పాండెంటు/ప్రతివాదులు:
శ్రీ పేరాబత్తుల వెంకటేశ్వర్రావు వగైరాలు

కోర్టు వారి ఆనతి మేర

పై దావాను మరియు పిటీషనుతో వాది/పిటీషనరు మీ పై ఇంజక్షను కోరి దాఖలు చేసి పెక్కుదినములు అయినను మీరు సదరు దావా గ్రంధమున మరియు టెంపరరీ యింజక్షను గ్రంధమున 3వ ప్రతివాది/ పిటీషనరు అయినను మరియు మీరు 1వ వారి కుమార్తె అయివుండి 1 మరియు 2 వారలతో జీవనము సాగించుచున్నను కావలెనని కాలయాపన సాగించుచున్నారు. సదరు విషయమును కోర్టు వారి దృష్టికి తీసుకు వెళ్ళగా శ్రీ కోర్టు వారు సదరు ఐ.ఎ నోటీసును మరియు దావా సమను తమ పేపరు ద్వారా పంపించ ఆదేశించినందున

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా సదరు పై గ్రంధము **ది. 06-12-2022న వేసియున్నారు.** కావున ఆరోజున మీరు ఖుద్దున గాని, విషయ పరిచయము గల వకీలు గారి ద్వారా ఆరోజున వచ్చి తమ స్టేటుమెంటు మరియు కౌంటరులు దాఖలు చేసుకొనగలరు. అట్టుల కాని పక్షమున సదరు దావా గ్రంధము మరియు పిటీషను మీ పరిముఖము లేకనే తదుపరి స్టెప్ తీసుకొన బడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాను.

Kum. Perabattula Venkata Sita Mahalakshmi, daughter of Venkateswara Rao, aged 18 years, Hindu, H.No. 1-29/1, Student, In the house of Mutyala Narasimha Murthy, Main Road, Nidamarru.

యాళ్లబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేదీ.29-11-2022 6303018736

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం రెండవ తరగతి మెజిస్ట్రేటు కం 2వ తరగతి జూనియర్ సివిలు జడ్జి, తాడేపల్లిగూడెం
ఐ.ఎ. నెం. 65/2020
అందున
ఓ.ఎస్. నెం. 55/2020

మధ్య:
పిటీషనరు/ వాది:
శ్రీ గంగిరాజు శ్రీరామ ప్రభాకరరావు
మరియు
రెస్పాండెంటు/ప్రతివాదులు:
శ్రీ గంగిరాజు వీర వెంకట సత్యన్నారాయణ వగైరాలు

కోర్టు వారి ఆనతి మేర

పై దావాను మరియు పిటీషనుతో వాది/పిటీషనరు మీ పై డిక్లరేషను మరియు ఇంజక్షను కోరి దాఖలు చేసి పెక్కుదినములు అయినను మీరు సదరు దావా గ్రంధమున మరియు టెంపరరీ యింజక్షను గ్రంధమున 2, 7, 9వ ప్రతివాదులు/ పిటీషనరులు అయినను మరియు మీరు 1వ వారి సమీప బంధువర్గము అయినను మీరు సదరు గ్రంధములో తమ అపియరెన్సు మాని కావలెనని కాలయాపన సాగించుచున్నారు. సదరు విషయమును కోర్టు వారి దృష్టికి తీసుకు వెళ్ళగా శ్రీ కోర్టు వారు సదరు ఐ.ఎ నోటీసును మరియు దావా సమను తమ పేపరు ద్వారా పంపించ ఆదేశించినందున

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా సదరు పై గ్రంధము **ది. 02-12-2022న వేసియున్నారు.** కావున ఆరోజున మీరు ఖుద్దున గాని, విషయ పరిచయము గల వకీలు గారి ద్వారా ఆరోజున వచ్చి తమ స్టేటుమెంటు మరియు కౌంటరులు దాఖలు చేసుకొనగలరు. అట్టుల కాని పక్షమున సదరు దావా గ్రంధము మరియు పిటీషను మీ పరిముఖము లేకనే తదుపరి స్టెప్ తీసుకొన బడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాను.

1. Respondent/ Defendant No.2:
Gangirju D.V.N.V.Prasad, Son of Veera Venkata Satyanarayana, aged 38 years, Hindu, Private Employment in Hyderabad and Permanent resident of H.No. 3-21, Vissakoderu, Palakoderu Mandalam.

2. Respondent/ Defendant No.7:
Smt. Konisetti Chandrika, Wife of Balaji, aged 32 years, H.No. 3-118, House wife, Losasrigutlapadu, Gollavani tippa Hospital, near by Bhimavaram Mandal.

3. Respondent/ Defendant No.9:
Kommireddi Durga Sai Venkata Mahesh, Son of Ganesh, aged 28 years, Kotikireddy vari street, H.No. 8-202, Vissakoderupalem, Palakoderu Mandal.

యాళ్లబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేదీ.29-11-2022 6303018736